
సాక్షి ఒడిశా

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,01,916లు, బంగారం 3.10 గ్రాములు, వెండి 31.10 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



బియ్యం లోడుతో ట్రక్ బోల్తా

- 8లో

కంద్రవీధిలో వైద్య శిబిరం



పర్లాకిమిడి: గజపతి వాకర్స్ క్లబ్, హోప్ చారిటీ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కంద్రవీధి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రొ దీనిని ప్రారంభించగా, 94మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



ప్రత్యేక పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

పర్లాకిమిడి: పట్టణంలోని రాజవీధిలో ఉన్న పాడుగు కోవెలలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పర్లాకిమిడి స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు గోడి శ్రీనివాసరావు, రవి, గోడి పార్వతీశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారి తిరువీధి ఉత్సవం, అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నడి సముద్రంలో పడవ బోల్తా

భువనేశ్వర్: చేపల వేటకు వెళ్లిన పడవ పూరీ నడి సముద్రంలో బోల్తా పడింది. పడవలో ఉన్న ఇద్దరు మత్స్యకారులు అదృష్టావశాతు ప్రాణాలతో ఒడ్డుకు చేరారు. తోటి వేటగాళ్ల సాయంతో వీరందరినీ సురక్షితంగా తీరానికి చేర్చారు. బాధితులు పూరీ జిల్లా ఒరొఖొ ఖుదా పంచాయతీ వాసులుగా గుర్తించారు. చేపల వేట ముగించుకుని తిరిగి వస్తుండగా పడవ మొరాయించిందని ఈ సందర్భంగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అకస్మాత్‌గా ఇంజిన్ దెబ్బ తినడంతో నడిసముద్రంలో పడవ బోల్తా పడిందన్నారు. దీనిని గమనించిన సమీపంలోని మరో పడవలో ఉన్న మత్స్యకారులు.. సమయ స్ఫూర్తితో రంగంలోకి దిగి కొట్టుమిట్టాడుతున్న తోటి మత్స్యకారులను ఆదుకున్నారు. వీరిని సురక్షితంగా తీరం చేర్చారు.

ఫ్యాన్సీ దుకాణంలో చోరీ



దుకాణం షట్టర్ విరగ్గొట్టి ఉన్న దృశ్యం

రాయగడ: పట్టణంలోని న్యూ కాలనీ మీనజ్ వెరైటీ ఫ్యాన్సీ దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం షట్టర్ విరగ్గొట్టి, లోపలికి చొరబడిన దుండగులు.. సామగ్రి చిందర వందరగా చేసి, క్యాష్ కౌంటర్ లోని రూ.2 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి ఆదివారం తెల్లవారి అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు దుఖాణం షట్టర్ విరిగి ఉండటాన్ని గమనించి, యజమాని మహ్మద్ రిహాజ్‌కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న ఆయన.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జయపురం క్రీడాకారులకు పతకాలు

జయపురం: ఈనెల 11, 12 తేదీల్లో హర్యాణా జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో జయపురం క్రీడాకారులు సత్తా చాటారు. పట్టణంలోని కొత్తవీధికి చెందిన లింగరాజ్ పూజారి, లింగరాజ్ నగర్ దినేష్ మిశ్రా వేర్వేరు కేటగిరీల్లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. ఇరువురికీ పతకాలతో పాటు ట్రోఫీ అందించిన నిర్వాహకులు.. సత్కరించారు. జయపురం అర్జిత్ బాక్సింగ్ క్లబ్ చీఫ్ అర్జిత్ మహాపాత్రొ, క్రీడాకారులు అభినందించారు.

నాసిరకం రోడ్డు మాకొద్దు..



రోడ్డు పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ-74, ఎంపీ-78 గ్రామాల మధ్య నిర్మించిన రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు అంతా పనుల ప్రదేశానికి చేరుకొని, నిర్మాణాలను అడ్డుకున్నారు. ప్రధానమంత్రి యోజనా పథకంలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ లతో అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పనులు పూర్తి కాకుండానే రోడ్డు దెబ్బ తింటోందన్నారు. ఈ నేపథ్యంలో పనుల ప్రదేశానికి చేరుకొని, అడ్డుకున్నారు.

ఒక్క తాటిపైకి.. తెలుగు సంఘాలు



సమావేశంలో పాల్గొన్న తెలుగు సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు



ప్రసంగిస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వీఎస్ రాజు

- రాయగడలో ఒకే వేదికపై ఉగాది ఉత్సవాలు
- ఏకగ్రీవంగా తీర్మానించిన తెలుగు సంఘాల ప్రతినిధులు
- ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రాజు ఎన్నిక

రాయగడ: ఈ ఏడాది ఉగాది ఉత్సవాలు ఒకే వేదికపై నిర్వహించేందుకు తెలుగు సంఘాలు తీర్మానించాయి. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా 2 వేదికలపై ఉత్సవాలు జరుగుతాయనే సందిగ్ధతపై ఎట్టకేలకు తెరపడింది. పట్టణంలోని బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర సమావేశ మందిరంలో తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న తెలుగు సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కాగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది వీఎస్ రాజును ఏకగ్రీవంగా నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగేందుకు అంతా సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు చంద్రమౌళి కుముందాన్ మాట్లాడుతూ ఏటా ఒకే వేదికపై ఉత్సవాలు జరిగేవని గుర్తుచేశారు. 2013 నుంచి రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి నేతృత్వంలో కార్యక్రమాలు జరుగుతుండగా.. ఈ ఏడాది గందరగోళం నెలకోవడం విచారకరమన్నారు. తెలుగు వారిని ఒకే తాటిపై నడిపించాల్సిన అవశ్యకత అన్ని తెలుగు సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులకు ఉందని స్పష్టంచేశారు. 1995 నుంచి స్పందన తెలుగు, సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు దివంగత ఆనందరావు కుముందాన్ నేతృత్వంలో ఉత్సవాలు నిర్వహించేవారిని, అనంతరం నెక్కంటి బాధ్యతలు వహించేవారని వివరించారు. అందరిలో మనస్పర్థలు తొలగి, అంతా ఒకే వేదికపై ఈ ఏడాది కూడా ఉత్సవాలను నిర్వహించాలని తన అభిప్రాయం వ్యక్తంచేశారు.

బాధ్యతగా వ్యవహరిస్తా..

కళింగ వైశ్యసంఘం అధ్యక్షుడు నరేష్ కుముందాన్ మాట్లాడుతూ తెలుగు వారి భాషా, సంస్కృతికి అద్దం పట్టే ఈ వేడుకల్లో తెలుగువారి మధ్య ఐక్యతను చాటే విధంగా ఉత్సవాలు నిర్వహించాలే తప్ప, ఒకరిపై మరొకరు మనస్పర్థలు పెంచుకునే విధానానిక వేదిక కాకూడదని సూచించారు. ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన వీఎస్ రాజు మాట్లాడుతూ తెలుగు వారి సమస్యలు, వారి భాషా, సంస్కృతిని పరిరక్షించడం అందరి కర్తవ్యంగా భావించాలన్నారు. ఎటువంటి బేధాభిప్రాయాలు లేకుండా అంతా కలసికట్టుగా కార్యక్రమాలను నిర్వహించాలని హితవు పలికారు. అందరి సహకారంతోనే ఉత్సవాలు నిర్వహించడం సాధ్యమవుతుందని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రంగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు.

ఏకాభిప్రాయం ఆనందకరం..

జిల్లా పరిషత్ మాజీ సభ్యులు పి.గౌరీశంకరరావు మాట్లాడుతూ తెలుగు సమాఖ్య నిర్వహించే ప్రతి సమావేశంలో తెలుగు వారంతా తమ ఐక్యతను చాటుకునే విధంగా సమావేశాలకు హాజరవుతున్నారని ఆనందం వ్యక్తంచేశారు. అయితే కొద్ది రోజుల క్రితం ఉగాది వేడుకలు 2 వేదికలపై జరుగుతాయన్న వదంతులు వ్యాపించడంతో అందిరిలో గందరగోళం నెలకొందన్నారు. ఆ అవాంతరాలకు అడ్డుకట్ట వేసేందుకే అన్ని తెలుగు సంఘాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులతో అత్యవసర సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అందరి ఏకాభిప్రాయంతో ఉత్సవాలు నిర్వహించాలనేది తెలుగు సమాఖ్య ప్రధాన ఉద్దేశమే తప్ప, వేరే ఆలోచనలేదని స్పష్టం చేశారు. అందిరి ఏకాభిమతంతో ఈ ఉత్సవాలను జరుపుకొనేందుకు నిర్వహించిన ఈ సమావేశం సత్ఫలితాలు ఇవ్వడంతో పాటు తెలుగు వారిలో నెలకొన్న అనిశ్చితతకు తెరపడటం హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సభ్యులు ధవలేశ్వర్ నాయుడు, కింతలి రాజు, కొండబాబు, బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ తదితర ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం అన్ని సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు జయకేతనం చిహ్నాన్ని చూపిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చారు.

ధ్యానంతో ఆత్మ శుద్ధి

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గీతంజలి దాస్

బరంపురం: దేహం స్నానంతో శుభ్రం అవుతుందని, మనస్సుద్ధి ధ్యానంతో సాధ్యపడుతుందని ఉత్కళ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ పేర్కొన్నారు. బరంపురం నగరంలోని ఓం శాంతి భవనంలో ప్రజాపతి బ్రాహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రపంచ శాంతికి ఎంతో విఘాతమన్నారు. ప్రచారకర్త రాజయోగిన బ్రహ్మకుమారి మంజు మాట్లాడుతూ ప్రపంచ శాంతితో పాటు మనిషి ఆరోగ్యం కూడా అవసరమని తెలిపారు. యోగ, ధ్యానం చేయడం ద్వారా భగవంతున్ని చేరుకోవచ్చని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, సేవకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వీసీ గీతాంజలి దాస్, బ్రహ్మకుమారి మంజు, మాల



కార్యక్రమానికి హాజరైన బ్రహ్మకుమారీలు, సేవకులు

సుకన్య సమృద్ధిపై అవగాహన



ఉత్తమ సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: చిన్నారి ఆడపిల్లను భవిష్యత్‌లో ఆదుకొనే సుకన్య సమృద్ధి పథకం ప్రతి ఇంటికీ చేర్చేందుకు తపాలా విభాగం ఉద్యోగులు, ఆశా, అంగ్‌వాడీ వర్కర్లు సహకరించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. స్థానిక సమితి కేవిడి పంచాయతీలో కొరాపుట్ జిల్లా తపాలా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిర్వహించిన డాక్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కొరాపుట్ పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ప్రగడ మనోజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత తపాలా శాఖ ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తోందని తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన తపాలా విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ చేయూత అందివ్వాలని కోరారు. పోస్టాఫీసుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వినియోగించు కునేందుకు ప్రతిఒక్కరూ సొంత ఖాతాను కలిగి ఉండాలని సూచించారు.



సుకన్య సమృద్ధి యోజనలో ఖాతాలు తెరిచేందుకు క్యూ కట్టిన గ్రామస్తులు

పోస్టల్ ఎస్పీ మాట్లాడుతూ డాక్ మేళా ప్రధాన లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. తపాలా సేవలు ప్రతి మారుమూల గ్రామాలకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. మేళాలో కేవిడి, రాణిగుడ, పూజారిపుట్ పంచాయతీల సర్పంచ్‌లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ అభిమన్యు, జయపురం నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పి.దినేష్, బొరిగుమ్మ సబ్ పోస్టుమాస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

కళలకు పుట్టినిల్లు.. పర్లాకిమిడి



మాట్లాడుతున్న కథకుడు నృసింహ పట్నాయిక్

పర్లాకిమిడి: ఒడిశాలో పర్లాకిమిడికి చెందిన కవులు, రచయితలు ఎవరికీ తీసిపోరని ఒడిశా సాహిత్య అకాడమీ మాజీ సభ్యుడు బుల్లు హొత్తా అన్నారు. పట్టణంలోని ఉత్కళ హితేషిణీ భవనంలో ఆదివారం జరిగిన యువప్రతిభా కథకుడు నృసింహ పట్నాయిక్ రచించిన కథల పుస్తకం 'శతాబ్ది రేవతి'ని ఉపాంత ప్రహరి పూర్ణచంద్ర మహాపాత్రొ, అశోక్ పట్నాయక్(నవరంగ్‌పూర్), సాహిత్య అకాడమీ సభ్యుడు బిచిత్రానంద బెబర్తా, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రీనా సాహు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుల్లు హొత్తా పర్లాకిమిడి మహారాజా కృష్ణ చంద్ర గజపతి నారాయణదేవ్ హయాంలో కవులు, రచయితలు, రంగస్థల నటులను ఎంతో ఆదుకుని, వారికి తగిన ప్రోత్సాహం ఇచ్చేవారని గుర్తు చేసుకున్నారు. వందేళ్ల నాటి రచనలు ఎవరి వద్దయినా ఉంటే వాటిని అప్పగిస్తే తమ సంస్థ ద్వారా ప్రచురిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమంలో కృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ త్రిపాఠి, ఆల్ ఇండియా రేడియో కో-ఆర్డినేటర్ దేవీరాణి నందా తదితరులు పాల్గొన్నారు.

కపిలాస్‌లో చంద్రశేఖర దర్శనం



పవిత్ర మహా శివరాత్రి పురస్కరించుకుని డెంకనాల్ కపిలాష్ అధిష్టాత మహాదేవుడు చంద్రశేఖర జాగర జాతర జయప్రదంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు చంద్రశేఖరుని జాగర జాతర కనులారా తిలకించి తరించారు.

దీప దర్శనం.. పాప నాశనం



విద్యుత్ దీపాల వెలుగుల్లో లింగరాజ స్వామి ఆలయం

ధవళేశ్వరంలో..



కటక్ జిల్లా ఆఠొగొడా బాబా ధవలేశ్వర్ పీఠంలోని మహా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ పూజలు పురస్కరించుకుని నాలుగు ధూపాలు, ఐదు అభిషేకాలతో ధవళేశ్వరునికి ప్రత్యేక మండువా భోగ్ నివేదించారు. చివరగా అర్ధరాత్రి ఒంటి గంటకు భక్తులు మహాదీపాన్ని దర్శించుకున్నారు.

- ఆలయాల్లో కొనసాగిన మహా శివరాత్రి పూజలు
- అర్ధరాత్రి శిఖర దీప దర్శనానికి పోటెత్తిన భక్తులు
- విద్యుత్ కాంతులతో లింగరాజ ఆలయానికి ప్రత్యేక శోభ

భువనేశ్వర్: మహా శివరాత్రి పూజలు, ఉత్సవాల్లో అత్యంత మోక్షదాయకం దీప దర్శనం. శైవ క్షేత్రాల్లో ఆలయ శిఖరాన దీపదర్శనం కోసం భక్తజనం అకుంఠిత భక్తి శ్రద్ధలతో నిరీక్షించారు. పగలంతా ఉపవాసం చేపట్టి.. సంధ్యా సమయానికి ఆలయ ప్రాంగణానికి చేరారు. ఈ ప్రాంగణంలో శిఖర జ్యోతి దర్శనం కోసం అఖండ దీపంతో ఓం నమఃశివాయ నామజపంలో నిమగ్నయ్యారు. దాదాపు అర్ధరాత్రి సమయంలో ప్రముఖ శైవక్షేత్రాల్లో భక్తులకు మహా దీపదర్శనం లభించింది. మరికొన్ని చోట్ల వేకువ జాము 4.30 గంటల ప్రాంతంలో ఈ దర్శనం పొందారు. ఆలయ శిఖరాన మహాదీపం మిణుగురులాడడంతో భక్తుల హరహర మహదేవ నామస్మరణతో దేవస్థానం పరిసరాలు మార్మోగాయి. దీపదర్శనం మహా భాగ్యమని భక్తులు తన్మయులయ్యారు.

ఏకామ్ర క్షేత్రంలో..

లింగరాజు ఆలయంలో మహా దీపదర్శన ఘట్టం అత్యంత భక్తి శ్రద్ధలతో ముగిసింది. శివనామ స్మరనతో ఏకామ్ర క్షేత్రంతో భక్తిభావం వెల్లివిరిసింది. సంప్రదాయ రీతిలో మహాదీపం ఆలయ ప్రాకార పరిక్రమ నిర్వహించారు. అనుబంధ సేవాదుల్లో జాప్యం ఆలయ శిఖరదీప సేవను ప్రభావితం చేసింది. దాదాపు 3 గంటల ఆలస్యంగా అర్ధరాత్రి 1:08 గంటలకు భక్తులకు మహాదీపం దర్శనం లభించింది. శనివారం రాత్రి 10 గంటలకు మహాదీపం దర్శనం సమయం ఖరారు చేశారు. సమర్థ సేవాయత్ వర్గం దీపాన్ని తీసుకొని ఆలయ శిఖరాన ప్రతిష్ఠించారు. అపరాహ్న ధూపసేవ విరామం కల్పించారు. సంధ్యా ధూపదీపాలతో ఉత్సవ మూర్తులకు బింధుసాగర్ నుంచి సేకరించిన అష్టోత్తర శత(108) కలశ జలాభిషేకం చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకార పరిక్రమ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉపవాసంతో జాగర దీక్ష భక్తుల కోసం ప్రత్యేక భద్రతతో భారీ ఏర్పాట్లు చేశారు. మహా దీపదర్శనం తర్వాత భక్తులు ఉపవాసం విరమించారు. మరోవైపు ఆలయ శుద్ధి ప్రక్రియ ముగించి లింగరాజు ప్రభువుకు వీరకిషోర్ అలంకరణ చేశారు.

శివ, కేశవ క్షేత్రం..



భువనేశ్వర్: లింగరాజు కొలువుదీరి నిత్య పూజలందుకుని భక్తులను మురిపిస్తున్న క్షేత్రం ఏకామ్ర క్షేత్రంగా చరిత్ర పుటల్లో స్థానం సాధించింది. ఈ క్షేత్రం వాస్తవ నిర్మాణం 6వ శతాబ్దంలో ఆరంభమై 11వ శతాబ్దంలో పూర్తి కావడం విశేషం. ఈ క్షేత్రంలో శివ, కేశవులు మమేకమై పూజలందుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో లింగరాజు ఆలయంలో అధిష్టాత దేవునికి ఉభయ తులసి, బిల్వ దళాలతో అర్చించడం ఆచారంగా కొనసాగుతోంది. రాష్ట్ర పర్యటన రంగంలో బంగారు త్రిభుజం (గోల్డెన్ ట్రై యాంగిల్) సముదాయంలో ఒకటిగా వెలుగొందుతుంది. లింగరాజ ఆలయ సుమదాయంలో పలు చిన్న, పెద్ద ఉప ఆలయాలు లెక్కకు మిక్కిలిగా విస్తరించి సందర్శకులను ఔరా అనిపిస్తాయి. దేవస్థానం బయట విభిన్న శైలిలో ఎక్కడికక్కడ మరెన్నో ఆలయాలు పర్యాటకులను ఆకట్టుకోవడంతో భువనేశ్వర్ ఆలయ నగరం(టెంపుల్ సిటీ)గా పేరొందింది.

క్లుప్తంగా

డోలీలో బాలింత తరలింపు



బాలింతను డోలీలో తరలిస్తున్న ఆశావర్కర్, ఏఎన్ఎంలు

శృంగవరపుకోట: బాలింతను ఆస్పత్రిలో చేర్చేందుకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది డోలీ కట్టి తరలించారు. శృంగవరపుకోట పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామమైన గురిలోవ గ్రామానికి చెందిన గిరిజన మహిళ జన్ని మంగ శనివారం తెల్లవారుజామున గ్రామంలోనే ప్రసవించి మగబిడ్డను ప్రసవించింది. ఈ విషయం తెలిసి ఏఎన్ఎం పార్వతి, ఆశ వర్కర్ లక్ష్మి ఆదివారం గురిలోవ గ్రామానికి వెళ్లి ఆమె ఆరోగ్యంపై ఆరాతీశారు. బాలింత కడుపునొప్పి అని చెప్పడంతో గ్రామంలో సహాయం చేసే వారెవరూ లేకపోగా డోలీలో ఆమెను తరలించే ప్రయత్నం చేశారు. కాగా మంగ కొంత దూరం వచ్చిన తర్వాత ఆస్పత్రికి రానని చెప్పడంతో ఇంటికి చేర్చి అక్కడే వైద్యం చేశారు. కాగా గర్భిణి ముందుగా ఆస్పత్రికి ఎందుకు చేర్చలేదని, డోలీలో ఎందుకు మోయాల్సి వచ్చిందని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి లావణ్యను వివరణ కోరగా రికార్డుల ప్రకారం జన్ని మంగకు జూన్ నెలలో డెలివరీ డేట్ ఇచ్చారని, కాగా ఇది 4వ ప్రసవం కావడంతో ముందస్తుగా ప్రసవం జరిగిందని, వైద్యాధికారిణి, తదితర సిబ్బంది సోమవారం గ్రామానికి వెళ్లి సేవలు అందిస్తారని వివరణ ఇచ్చారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలపై నిఘాపెట్టిన వన్‌టౌన్ పోలీసులు ఆదివారం గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి దగ్గర రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మాట్లాడుతూ అరకు ప్రాంతం నుంచి తీసుకువచ్చిన గంజాయిని చిన్న ప్యాకెట్ల రూపంలో కట్టి, అమ్మకాలు చేస్తున్న రొంప త్రిమూర్తులు అలియాస్ నాని, వాండ్రంగి గౌరీశంకర్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

గార: శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేట గ్రామానికి చెందిన జగ్గుపిల్లి నాగు అదే గ్రామ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తొలుత రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కాలును తొలగించగా చికిత్స జరుగుతోంది. ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

కొమరాడ: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన గుంపసోమేశ్వర ఆలయం అభివృద్ధికి కాపారపు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాపారపు శివున్నాయుడు రూ.25 లక్షలు విరాళం అందజేస్తామన్నారని కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణ తెలిపారు. గుంపలో ఆదివారం జరిగిన జాతరలో శివున్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుంపసోమేశ్వరుడి ఆలయానికి సరైన రహదారి లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రహదారి నిర్మాణానికి తనవంతుగా లక్ష రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, సుంకరి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

సీతంపేట: పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా మారుమూల ఉన్న దోనుబాయి పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. కేస్ రికార్డులు, స్టేషన్ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్సై కిషోర్‌వర్మ ఉన్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

భామిని: మండలంలోని పసుకుడి వద్ద తిష్ట వేసిన 4 ఏనుగుల గుంపు వంశధార నదికి అవతల ఉన్న ఒడిశా గ్రామాలైన వన్న, గౌరి మధ్య విస్తరించిన మడ భూముల్లో సంచరిస్తున్నాయి. అయితే అక్కడ వాటికి ఆహార కొరత, అటవీ సిబ్బంది వాటిని అడ్డుకోవడంతో ఏనుగుల గుంపు తిరిగి ఆంధ్రా వైపు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఏనుగుల దాడిలో ట్రాకర్ మృతి చెందడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

వాహన తనిఖీలు

సీతంపేట: స్థానిక దోనుబాయి కూడలి వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, సరైన వాహన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై అపరాధ రుసుం విధించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలను ఆపి, డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బియ్యం లోడుతో ట్రక్ బోల్తా

- డ్రైవర్ మృతి.. క్లీనర్‌కు గాయాలు
- రాయగడలో ఇద్దరు యువకులు మృతి

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా నుంచి గంజాం జిల్లా సరిహద్దు తప్తపాణి ఘాట్ రోడ్డులో బియ్యం లోడుతో వెళ్తున్న భారీ ట్రక్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతిచెందగా.. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేశారు. దీనిపై బల్లిగుడా ఎస్‌డీపీఓ మనోజ్‌కుమార్ పూజారి తెలిపిన వివరాల ప్రకారం కొందమాల్ జిల్లా బల్లిగుడా నుంచి తప్తపాణి ఘాట్ రోడ్డు మీదుగా ఆదివారం ఉదయం బరంపురం వైపు వెళ్తున్న భారీ ట్రక్ లోయలో పడి బోల్తా పడింది. ఈ ఘటనలో ఖుర్దా జిల్లా జట్నీకి చెందిన డ్రైవర్ లోక్‌నాథ్ సాహు అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక, ఒడ్రాఫ్ బృందం సాయంతో క్షతగాత్రుడిని బంజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బోల్తాపడిన ట్రక్‌ను క్రైన్ సాయంతో బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధి గిట్టిపాడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతులు గడ్డిశెశిఖాల్ పంచాయతీ రాంపూర్‌కు చెందిన బులు బెనియా(37), మనోజ్ బెనియా(25)గా గుర్తించారు. విషయం తెలుసుకున్న చందిలి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బులు, మనోజ్ తమ పనులు ముగించుకొని, జేకేపూర్ నుంచి తమసొంత గ్రామం రాంపూర్‌కు బైక్‌పై బయలుదేరారు. అదే సమయంలో సింగుపూర్ నుంచి వస్తున్న పికప్ వ్యాన్ గిట్టిపాడ వద్ద బలంగా ఢీకొంది. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు చెల్లాచెదురుగా పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఇరువురూ ఘటనా స్థలం వద్దే మృతిచెందారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా, చుట్టుపక్కల వారు అడ్డుకొని, పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని రాంపూర్ గ్రామస్తులు గిట్టిపాడ రోడ్డుపై ఆందోళనకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళన కారులకు నచ్చజెప్పడంతో అంతా విరమించారు. ఈ మేరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. యధావిధిగా కొనసాగాయి.



ప్రమాదానికి కారణమైన వ్యాన్



రాయగడ: ఘటనా స్థలంలో బుల్లి మృతదేహం



కైలాష్ నాయక్



కిషన్ మల్లిక్

ఏనుగుల దాడిలో..

బరంపురం: జిల్లా పరిధిలోని ఉత్తర ఘుమసర అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపును తిరిగి అడవిలోకి తరిమెందుకు వెళ్లిన ఇద్దరు అటవీశాఖ ట్రాకర్ లపై గజరాజు దాడి చేయడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. డీఎఫ్ఓ అమూల్యకుమార్ ప్రధాన్, బాధితులు అందించిన వివరాల ప్రకారం గంజాం జిల్లా ఉత్తర ఘుమసర అటవీ ప్రాంతం వెలుపల ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు సమాచారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఏనుగుల గుంపును తిరిగి అడవిలోకి తరిమేందుకు ట్రాకర్‌లు రంగంలోకి దిగారు. ఈ సమయంలో గుంపులోని ఆడ ఏనుగు వారిపై దాడి చేసి, గాయపరిచింది. దీంతో మిగతా వారంతా గ్రామం వైపు పరుగులు తీశారు. బాధితులను కైలాష్‌నాయక్, కిషన్ మల్లిక్‌ను వెంటనే బంజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు.



రాయగడ: తప్తపాణి ఘాట్ రోడ్డులో బోల్తాపడి ఉన్న బియ్యం ట్రక్



ఉత్తర ఘుమసర అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

షటిల్ టోర్నమెంట్ విజేత ఎస్.కోట

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో శ్రీకాకుళం, కాకినాడ
- నగదు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజయనగరం పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ జన్మదినోత్సవం సందర్భంగా చీపురుపల్లి పట్టణంలోని బెల్లాన సింహాచలం వెల్ఫేర్ అసోసియేషన్ ఇండోర్ స్టేడియంలో ఉత్తరాంధ్ర స్థాయి షటిల్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు 54 జట్లు హాజరయ్యాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో ఎస్.కోటకు చెందిన దినేష్, ఆదిత్యల జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రూ.10 వేలు, శ్రీకాకుళానికి చెందిన మనోహర్, సాయిల జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా రూ.8 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కాకినాడకు చెందిన అప్పారావు, రాజేష్‌ల జట్టుకు రూ.6 వేలు నగదు బహుమతి ప్రదానం చేశారు. ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సన్యాసిరావులు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో శరత్, స్వరూప్, వేణు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.కోట జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న ఎంపీ తనయుడు వంశీకృష్ణ

మూడేళ్లుగా మంచానికే పరిమితం

- అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన యువతి
- వైద్యం చేయించే స్థోమత కరువు
- దాతల సాయం కోసం ఎదురు చూపు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి పంచాయతీ రుషినికాలనీలో ఓ నిరుపేద గిరిజన కుటుంబం దాతల సాయం కోసం అభ్యర్థిస్తోంది. కాలనీకి చెందిన బిడ్డిక తెలుంగు, కళావతిల కుమార్తె మణి(20) కరోనా ప్రారంభ సమయంలో కాళ్లుచేతుల నొప్పులతో బాధపడుతూ విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వెళ్లి వైద్యసేవలు పొందింది. అయినప్పటికీ నయం కాకపోవడం, కరోనా విజృంభించడం వంటి కారణాలతో పాటు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలందించే స్థోమత లేకపోవడం వల్ల తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చేశారు. అప్పటినుంచి కూర్చోలేక, కాళ్లుచేతులు కదపలేక మూడేళ్లుగా ఆ యువతి మంచానికే పరిమితమైంది. బహిర్భూమి వంటి కాలకృత్యాల కోసం ఇద్దరు వ్యక్తులు ఎత్తుకుని తీసుకెళ్లాల్సిన పరిస్థితి. ఒక్కో ఇంజక్షన్ రూ.25వేల చొప్పున కనీసం రూ.2, రూ.3 లక్షల వరకు వెచ్చిస్తే ఆ యువతి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నప్పటికీ, అంతమాత్రం వెచ్చించే పరిస్థితి లేకపోవడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు దాతల సాయం కోసం అభ్యర్థిస్తున్నారు. ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న కూతురు తమ బీదరికం వల్ల కళ్లముందే కృశించుకుపోతోందని దాతలెవరైనా ముందుకు వచ్చి సాయం అందించాలని కోరుతున్నారు. వివరాల కోసం ఫోన్ 8500106167 నంబర్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మంచానికే పరిమితమైన మణి

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

- లక్షమందికి పైగా తరలివచ్చిన భక్తజనం
- బందోబస్తు నిర్వహించిన పోలీస్ శాఖ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ జాతరలో సుమారు లక్షమందికి పైగా భక్తులు శివకేశవులను దర్శించుకున్నట్లు అంచనా. ఆలయ ప్రాంగణం, కల్యాణమంటపం, బోడికొండ తదితర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసాయి. అలాగే సమీపంలో గల నీలాచలం బోడికొండ, రామస్వామి వారి ఆలయం, కోనేరు గట్టు తదితర ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందు రోజు రాత్రంతా జాగారాలు చేసి ఉదయాన్నే రామకోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ సీతారామస్వామివారిని, పక్కనే ఉన్న ఉమాసదాశివ స్వామివారిని అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12గంటలకు ఉమా సదాశివాలయంలో లింగోద్భవ పూజలు వైభవంగా జరిగాయి. ఆ సమయంలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటీపడ్డారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భోగాపురం, పూసపాటిరేగ, లావేరు, రణస్థలం, భీమిలి, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రతిమను మధ్యలో ఉంచి చుట్టూ వృత్తంలా ఏర్పడి సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేశారు. అలాగే బోడికొండపై ఉన్న చారిత్రక ఆధారాలను చూడడానికి అధిక సంఖ్యలో సందర్శకులు తరలివెళ్లారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తదితరులు ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

పోలీసుల సేవలు భేష్

మహాశివరాత్రి జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 300 మంది పోలీసులు గస్తీ నిర్వహించారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆధ్వర్యంలో డీఎస్పీతో పాటు ఆరుగురు సీఐలు మహాశివరాత్రి బందోబస్తును పర్యవేక్షించారు. డ్రోన్ కెమెరాలతో భక్తుల రద్దీని చిత్రీకరించి అల్లరిమూకలపై దృష్టి సారించారు. క్యూల వద్ద తోపులాట జరగకుండా పర్యవేక్షించారు. మిమ్స్ మెడికల్ కళాశాల, సతివాడ, కొండవెలగాడ పీహెచ్‌సీ సిబ్బంది వైద్యసేవలు అందించారు. వివిధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు అంకితభావంతో సేవలందించారు.





రామకోనేరు వద్ద భక్తుల రద్దీ (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో ఉమా సదాశివస్వామి

కవితా నిలయం లోగో ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో ఆదివారం కవితా నిలయం నెలవారీ కార్యక్రమంలో భాగంగా సాహితీ సమీక్ష జరిగింది. ముందుగా డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కవితా నిలయం లోగో ఆవిష్కరించారు. అనంతరం వావిలపల్లి రాజారావు రచించిన మహోన్నత శిఖరాలు(శతాధిక కవితామాలిక) పుస్తకంపై సమీక్ష నిర్వహించారు. సదరు పుస్తకాన్ని కవితా నిలయానికి బహుకరించారు. కార్యక్రమంలో కవితా నిలయం అధ్యక్షుడు ఈవేమన, గౌరవ అధ్యక్షుడు సురంగి మోహనరావు, ప్రధాన కార్యదర్శి ఉమాకవి, కార్యదర్శి సంతోష్, నవలా రచయిత కె.రంగనాయకులు, మహిళా కార్యదర్శి తేజస్విని పాల్గొన్నారు.

పుణ్యగిరిపై భక్తసిరి

మహాశివరాత్రి వేళ జాగారం చేసిన భక్తులు ఆదివారం ముక్కంటి దర్శనం కోసం కొండదారి పట్టారు. శివ పంచాక్షరీ జపంతో పుణ్యగిరి పర్వతంపై కొలువుదీరిన ఉమాకోటిలింగేశ్వరుని దర్శించేందుకు బారులు తీరారు. శనివారం పుణ్యగిరి క్షేత్రం భక్తులతో పులకించగా, ఆదివారం మధ్యాహ్నం వరకూ మెట్ల మార్గంలో భక్తులు వేలసంఖ్యలో 'హర హర మహదేవ'' అంటూ కదిలారు.

–శృంగవరపుకోట

- వేలాదిగా వచ్చిన భక్తులు
- ప్రశాంతంగా ముగిసిన జాతర



పుణ్యగిరికి తరలుతున్న భక్తులు

పుణ్యగిరి క్షేత్రంలో శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన దర్శనాలు ఆదివారం సాయంత్రం వరకూ నిరంతరాయంగా కొనసాగాయి. పుణ్యగిరికి శివరాత్రిరోజు వచ్చే భక్తులసంఖ్య కన్నా, జాగరణ చేసి మర్నాడు వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది శనివారం శనిత్రయోదశి, మహాశివరాత్రి, మాసశివరాత్రి కావడంతో తొలిరోజునే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. తూర్పుగోదావరి, విశాఖ, శ్రీకాకుళం, ఒడిశా నుంచి, భక్తులు తరలివచ్చారు. పుట్టుధార, ధారగంగమ్మ లోయల్లో స్నానాలు చేసేందుకు, భక్తులు తోపులాడుకున్నారు. భక్తులను తరలించేందుకు ఆర్టీసీ నిరంతరాయంగా బస్సులు నడిపి సేవలందించింది. పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఆర్టీసీ, పంచాయతీరాజ్. దేవాదాయశాఖ ఉద్యోగులు నిరంతరాయంగా సేవలు అందించారు.

ముక్కంటిని దర్శించిన ఎమ్మెల్యే

పుణ్యగిరిలో ఉమాపతిని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం, ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, గర్భాలయంలో పూజలు చేయించారు. శనివారం రాత్రి లింగోద్భవ సమయంలో ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు, ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు పుణ్యగిరిలో ఉమాపతిని దర్శించారు.

భక్తజన ఘోషతో పులకించిన సానువులు


ఆదివారం రాత్రి లింగోద్భవ సమయంలో అర్చకులు స్వామికి పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వకంగా రుద్రాభిషేకం చేస్తూ భక్తులకు దర్శనాలు కల్పించారు. హర..హర..మహదేవ, ఓం నమఃశివాయ అంటూ భక్తులు చేసిన నామజపంతో పుణ్యగిరి సానువులు పులకించాయి. భక్తుల సౌకర్యార్థం ఉచితం, శీఘ్ర, విశిష్ట దర్శనాలు కల్పించారు. పుణ్యగిరి మెట్ల మార్గంలో చిలక ప్రశ్నగాళ్లు, జంగమదేవర్లు, దాసర్లు, తోటపుఎద్దులు, భజన బృందాలు, చిల్లర దుకాణాలు, బొమ్మల వ్యాపారులు, కంచర సామగ్రి, ఇనుప వస్తువులు, ఇలా రకరకాల దుకాణాలతో పుణ్యగిరి జాతర భక్తులను అలరించింది.



పుణ్యగిరిలో ఆర్టీసీ సేవలు

సమన్వయంతో సేవలు

దేవాదాయ, పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, వైద్యారోగ్యశాఖ, పంచాయితీరాజ్ శాఖలు ఏర్పాటు చేసిన విశ్రాంతి షెల్టర్లులో పుణ్యగిరి జాతరకు వచ్చిన భక్తులు సేదతీరారు. భక్తులకు లడ్డూ, పులిహోర ప్రసాదాలు అమ్మకాలు చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం తావివ్వకుండా చర్యలు తీసుకోవడంతో పుణ్యగిరి జాతర ప్రశాంతంగా ముగిసింది. పంచాయతీ సిబ్బంది రోడ్లు తడుపుతూ, చెత్తా, చెదారం తుడుస్తూ, పారిశుద్ధ్యం పక్కాగా అమలు చేశారు. పుణ్యగిరిలో సీసీ కెమెరాల నిఘాలో పోలీసులు పర్యవేక్షణ చేశారు. అలాగే పుణ్యగిరికి తరలి వచ్చిన భక్తులకు స్థానిక స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ఆకలి దప్పులు తీర్చాయి. ఆదివారం ఉదయం నుంచి పుణ్యగిరి మార్గంలో రోడ్డుకి రెండువైపులా పులిహోర, చక్కెర పొంగలి. పరమాన్నం, పుచ్చకాయలు, టాటా గ్లూకోజ్, వాటర్ ప్యాకెట్లు, భోజనాలు ఏర్పాటు చేసి భక్తులకు ఆకలి తీర్చారు.



ధారగంగమ్మ లోయలో భక్తుల కోలాహలం



మెట్ల మార్గంలో తరలుతున్న భక్తులు



ఉమాపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



పుణ్యగిరిలో ప్రధానాలయం వద్ద క్యూలో భక్తులు



పుట్టుధార వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

అరసవల్లిలో భక్తుల సందడి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘ ఆదివారం సందడి కనిపించింది. ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పాటు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే మాఘ మాసం ప్రత్యేక అలంకరణలతో ఆదిత్యుని మూల విరాట్టును సిద్ధం చేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు కుటుంబసమేతంగా ఆదివారం ఉదయం స్వామిని దర్శించుకున్నారు. ఇక ఒక్కరోజులో దర్శనాల రూపంలో రూ.2,68,500, విరాళాల రూపంలో రూ.77 వేలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.60 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలియజేశారు.

ఘనంగా ఉమాజఠలేశ్వర స్వామి కల్యాణం



ఉమాజఠలేశ్వర స్వామి కల్యాణ వేడుక

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఉమాజఠలేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బి.అశ్వనీకుమార్, అర్చకులు మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామి ఉత్సవమూరులను మండపంలోకి తీసుకువచ్చి.. సంప్రదాయంగా కల్యాణ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రెయ్యిపేట టీచర్‌పై సస్పెన్షన్ వేటు

టెక్కలి: టెక్కలి మండలం రెయ్యిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పేర వాసుదేవరావును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడు వాసుదేవరావు పాఠశాల విధుల్లో అలసత్వం ప్రదర్శించడమే కాకుండా ఒక్క పూట తరగతులు నిర్వహిస్తున్నారంటూ రెండు రోజుల కిందట విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. దీంతో మండల విద్యా శాఖాధికారి డి.నాగభూషణరావు రెయ్యిపేట గ్రామంలో చేపట్టిన విచారణలో వాస్తవాలు వెలుగుచూశాయి. ఆ నివేదికను జిల్లా విద్యా శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. నివేదిక ఆధారంగా వాసుదేవరావును సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

జీబీటీ మిస్ ఇండియాకు అభినందన



మిస్ ఇండియా దేవిని అభినందిస్తున్న అభిమానులు

శ్రీకాకుళం కల్చరల్: గ్లోబల్ బ్యూటీ ట్రెజర్ పోటీల్లో మిస్ ఇండియాగా నిలిచిన దివకల దేవి ఆదివారం శ్రీకాకుళం వచ్చారు. నగరంలోని సన్ రైజ్ హోటల్‌లో ఆమెను వారి తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మావూరి కృష్ణారావు, వాసుదేవరావు, అను, పద్మజ, మావూరు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లోని తాజ్ బంజారాలో ఫిబ్రవరి 13 నుంచి నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో మిస్ ఇండియాగా నిలవడం ఆనందంగా ఉందని అన్నారు. శ్రీకాకుళంలో పుట్టినా విశాఖపట్నంలో ఉంటున్నామని తెలిపారు. ఈ పోటీల సమయంలో మానసిక ఒత్తిడికి గురయ్యానని, ఆ సమయంలో అమ్మ అందించిన సహకారం ఎంతో గొప్పదని చెప్పారు. అవకాశాలు వస్తే భవిష్యత్‌లో సినిమా రంగం వైపు వెళతానని అన్నారు.

దళిత కథా సంకలనంలో 'చంద్రయ్య'

పలాస: మండలంలోని రంగోయి గ్రామానికి చెందిన జానపద పరిశోధకుడు, రచయత, తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కమిటీ సభ్యుడు బద్రి కూర్మారావు రాసిన 'చంద్రయ్య' కథకు దళిత కథా సంకలనంలో చోటు లభించింది. అరుణ గోగుల మండ, మానస ఎండ్లూరు సంపాదకత్వంలో తెలంగాణ భాషా సంస్కృతి శాఖ ముద్రించిన 'ముళ్ళ చినుకులు' కథా సంపుటిలో చంద్రయ్య కథకు చోటు దక్కింది. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో 'ఊరి కాపరి'గా ఉన్న దండాశి కులస్తుల ఇతి వృత్తాన్ని తీసుకొని కూర్మారావు ఈ కథ రాశారు. ఇటీవలే హైదరాబాద్, విజయవాడలో కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. కాగా, ఈ నెల 21న అంతర్జాతీయ భాషా దినోత్సవం విజయవాడ పి.బి.సిద్దార్థ కళాశాలలో జరుగుతుందని కూర్మారావు తెలిపారు. మాతృ భాషల పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

భస్మాభిషేకం



మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రావివలస ఎండల మల్లికార్జున స్వామికి ఆదివారం భస్మాభిషేకం చేశారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ ఎస్.సుధాకర్ నేతృత్వంలో మల్లన్నను విభూదితో అలంకరించారు. అనంతరం అర్చకులు రామకృష్ణ, మోహన్, యుగంధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. – టెక్కలి

భక్తజన సంద్రం

వత్సవలసలో కొలువై ఉన్న రాజమ్మ తల్లి దర్శనానికి మూడో వారం భక్తులు పోటెత్తారు. ఆది పీఠాలైన మైలపల్లి శ్రీనివాసదాసు, జయమ్మ, పేరయ్య, తదితర స్థలాల్లో మొక్కులు తీర్చుకున్నారు. సుముద్ర స్నానాల వద్ద మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శనివారం రాత్రి జాగరణలు చేసి ఆదివారం దర్శనాలు చేసుకున్నారు. –గార



పోగుబంధం



శ్రీశైలం మల్లన్నకు పొందూరు నేతన్నకు అల్లుకున్న పోగుబంధం మరింత బలోపేతమైంది. చేనేత, జౌళి శాఖ ద్వారా బనిశెట్టి వీరాంజనేయులు, ఎం.దుర్గారావు, అల్లాడ సూర్యం, కె.శ్రీను, తూతిక ఈశ్వరరావు, కందాన శంకరరావులు మల్లన్నకు తలపాగా వస్త్రాలు నేసి స్వామికి సమర్పించారు. ఆలయ వంశపారంపర్య భక్తుడు పృథ్వీ వెంకటేశ్వరరావు స్వామికి తలపాగా చుట్టిన తర్వాత నవనందులకు, ఆలయ గాలి గోపురానికి మిగిలిన వస్త్రాన్ని అలంకరించారు. ఇక్కడ నుంచి వెళ్లిన వారికి శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాంగ సత్రం డైరెక్టర్ కాకర్ల రాజారావు సకల సౌకర్యాలు కల్పించారు. – పొందూరు

ట్రిపుల్ హ్యాపీ

- ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో మౌలిక వసతుల కల్పన
- ఆహ్లాదకర వాతావరణంలో కొత్త భవనాల నిర్మాణం



నిర్మాణంలో అకడమిక్ బ్లాక్

ఎచ్చెర్ల క్యాంపస్ : కనుచూపు మేర పచ్చటి వాతావరణం, ప్రకృతికి నష్టం వాటిల్లకుండా చక్కటి నిర్మాణాలు, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు భవనాలు.. వెరసి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఓ కొత్త లోకాన్ని తలపిస్తోంది. ఇక్కడి ఎస్ఎం పురంలోని కొండపై 2016లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటైంది. ప్రస్తుతం ప్రీ యూనివర్సిటీ కోర్సు మొదటి, రెండేళ్ల క్లాస్‌లు, ఇంజినీరింగ్ మొదటి, రెండో ఏడాది క్లాస్‌వర్క్ నిర్వహిస్తున్నారు. ప్రకృతి ఒడిలో ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థ ఏటా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వం అందజేసిన స్థలంలో శరవేగంగా అవసరం మేరకు నిర్మాణాలు సాగిస్తున్నారు. 2024 నాటికి పీయూసీ రెండేళ్లు, ఇంజినీరింగ్ నాలుగేళ్ల క్లాస్‌వర్క్ నిర్వహణకు ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారులు ఇప్పటి నుంచే దృష్టి పెడుతున్నారు. ఈ మేరకు నిర్మాణాలు చేస్తున్నారు.

అన్ని విధాలుగా అభివృద్ధి

- ట్రిపుల్ ఐటీలో టెండర్లు మేరకు భవన నిర్మాణాలను ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ సంస్థ చేపడుతోంది.
- ప్రస్తుతం రూ. 66.07 కోట్లతో న్యూ అకడమిక్ బ్లాక్ నిర్మాణం చేపడుతున్నారు.
- ఈ భవనం కొండపై ఉన్న డిజైన్ మేరకు నిర్మాణం చేస్తున్నారు.
- రూ.3.06 కోట్లతో ల్యాబ్‌ను కొండ దిగువ భాగంలో నిర్మిస్తున్నారు.
- రూ. 2.80 కోట్లతో డార్మిటరీ భవనాలు నిర్మిస్తున్నారు.
- విద్యార్థులు సైతం చదువుకునేందుకు అనువుగా విద్యాలయాన్ని తీర్చిదిద్దుతున్నారు.
- 2004 నాటికి మొత్తం పీయూసీ రెండు, ఇంజినీరింగ్ నాలుగు ఆరు బ్యాచ్‌లు 6000 మందితో నిర్వహించేలా నిర్మాణాలపై అధికారులు దృష్టిపెడుతున్నారు.
- సంస్థకు అవసరమైన భవనాల నిర్మాణానికి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.

పూర్తిస్థాయి క్యాంపస్ లక్ష్యంగా నిర్మాణాలు



పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. మొత్తం ఆరు వేల మంది విద్యార్థులకు వసతి గృహాలు, క్లాస్‌వర్క్ నిర్వహణకు భవనాలు అవసరం. 200 ఎకరాల స్థలంలో నిర్మాణాలు, బౌండరీ వాల్ వంటివి పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోంది. అద్దె భవనాల అవసరం లేకుండా నిర్వహణపై దృష్టిపెట్టాం.

– ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వర రావు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్



ప్రభుత్వం కేటాయించిన కొండ

విద్యుత్ శాఖ ఏఈపై రైతుల ఆగ్రహం



లావేరు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

లావేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ పంపుసెట్లకు 9 గంటల పాటు పగటిపూట నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ లావేరు, లావేటిపాలేం, కేశవరాయునిపురం, జీజీ వలస గ్రామాల రైతులు విద్యుత్‌శాఖ మండల ఏఈ వెంకటరమణమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల రైతులు ఆదివారం లావేరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. సీఎం ఆదేశాల ప్రకారం తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇంతవరకూ లావేరు సబ్‌స్టేషన్ నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వచ్చేదని, ఆదివారం నుంచి బుడుమూరు సబ్‌స్టేషన్‌కు మార్చారని చెప్పారు. బుడుమూరు సబ్‌స్టేషన్ నుంచి సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలను యథాతథంగా లావేరు సబ్‌స్టేషన్ నుంచి ఇవ్వాలని కోరారు. దీనిపై ఏఈ స్పందిస్తూ లావేరు విద్యుత్ లైన్‌మేన్, సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్లను పంపించి లావేరు సబ్‌స్టేషన్‌కు మార్పించడంతో రైతులు ఆందోళన విరమించారు.

డీపీఎల్ క్రికెట్ టోర్నీ విజేత సారవకోట



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య తదితరులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ధర్మాన ప్రీమియర్ లీగ్ సీజన్ –4 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సారవకోట జట్టు నిలిచింది. ఆదివారం వేకువజామున జరిగిన ఫైనల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్ఎస్‌సీపీ నరసన్నపేట జట్టు 8 ఓవర్లలో 47 పరుగులు చేసింది. 48 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సారవకోట జట్టు 7.2 ఓవర్లలో లక్ష్యం ఛేదించింది. విజేతగా నిలిచిన సారవకోట జట్టుకు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, సర్పంచ్ బూరల్లి శంకర్‌లు ట్రోఫీ, నగదు బహుమతి అందించారు. మ్యాన్‌ఆఫ్ ద సిరీస్‌గా ఎండీ బాబు, బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా సారవకోటకు చెందిన కశ్యప్, బెస్ట్ బౌలర్‌గా ప్రేమకుమార్ అవార్డులు అందుకున్నారు. అల్లంశెట్టి రవి, కె.సింహాచలం, ఎస్.రాము అంపైర్లుగా వ్యవహరించారు. రాక్‌స్టార్ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చీపురు కృష్ణ, ప్రసాద్, దండి జయప్రకాష్, రమణ సాహూ, డేవిడ్, బోయిన బాలకృష్ణ, గనగళ్ల శ్రీను, అసోసియేషన్ ప్రతినిధులు రాము తదితరులు పాల్గొన్నారు.

కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం: పురుషోత్తం

- పెద్ద సినిమా తీసిన పల్లెటూరి కుర్రోడు
- ఎస్‌జీఎఫ్ పేరుతో వెండి తెరపై గంటన్నర సినిమా
- సినిమా హాళ్లలో ఉచిత ప్రదర్శనలు



ఎస్‌జీఎఫ్ సినిమా పోస్టర్

ఇచ్ఛాపురం రూరల్: ఒక సాదాసీదా ఉద్దానం కుర్రాడు. సినిమాలపై ఇష్టం పెంచుకున్నాడు. ఎలాగైనా తనో సినిమా తీయాలని కలలు గన్నాడు. స్టూడియోల చుట్టూ తిరిగాడు. అనుభవం వచ్చింది గానీ అవకాశం రాలేదు. తనే సినిమా నిర్మించాలని కువైట్ వెళ్లి డబ్బులు కూడబెట్టాడు. సొంతూరిలో జరుగుతున్న కథను తన చిత్రానికి ఇతివృత్తంగా తీసుకున్నాడు. తెలిసిన వాళ్లను నటులుగా తీసుకుని గంటన్నర సినిమాను చిత్రీకరించేశాడు. తన ప్రతిభను చూడండంటూ థియేటర్లలో ఉచితంగా ప్రదర్శించాడు. ఇదేమీ రాబోయే కొత్త సినిమా కథ కాదు. పరిమిత వనరులతో సినిమా తీసిన కుర్రాడి స్టోరీ. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం పురుషోత్తం అన్న టైటిల్ కార్డు వెనుక దాగి ఉన్న విషయాలను తెలుసుకుందాం.

ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన పురుషోత్తం మజ్జి బీకాం డిగ్రీ పూర్తి చేశాడు. సినిమాలపై చిన్నప్పటి నుంచే విపరీతమైన ఇష్టం ఉండేది. ఆ ఇష్టంతోనే హైదరాబాద్ వెళ్లాడు. స్టూడియోల చుట్టూ తిరిగాడు. కానీ సినిమా అవకాశం అంత సులభంగా రాదని తొందరగానే గ్రహించాడు. సొంతంగా సినిమా తీయాలని నిశ్చయించుకుని స్నేహితులకు చెబితే అంతా నవ్విన వారే గానీ ప్రోత్సహించలేదు. అయినా పట్టు విడవలేదు. సినిమా తీయడానికి డబ్బులు సంపాదించాలని కువైట్ వెళ్లాడు. అక్కడ డబ్బులు కూడబెట్టాడు.

సినిమా తీయాలన్న తపనే గానీ అప్పటి వరకు కథ ఏమీ అనుకోలేదు. ఆ క్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సామాజిక సేవలు అందిస్తున్న స్పెషల్ గయ్స్ ఫౌండేషన్ గురించి అతనికి తెలిసి.. ఆ కథనే సినిమాగా తీయాలని నిర్ణయించుకున్నాడు. ఎస్‌జీఎఫ్ కార్యకర్తను సంప్రదించి అన్ని విషయాలను సేకరించిన రెండేళ్ల పాటు కష్టపడి 180 పేజీల కథను సిద్ధం చేశాడు. 2020లో కరోనా విజృంభిస్తున్న తరుణంలో స్వగ్రామానికి చేరుకున్నాడు.

రూ.రెండు లక్షలతో సినిమా..

కథ సిద్ధమయ్యాక.. సాంకేతిక వర్గం కోసం అన్వేషణ ప్రారంభించాడు. ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న స్నేహితుడు అభిరాం బిసాయిని కెమెరామెన్‌గా పెట్టుకున్నాడు. 2020 సెప్టెంబర్ నెలలో తను తీయబోయే సినిమాకు నటులు కావాలంటూ సోషల్ మీడియాలో చేసిన ప్రకటనకు స్పందన నామమాత్రంగానే వచ్చింది. అయినా వచ్చిన వారినే నటులుగా పెట్టుకున్నాడు. ఉద్దానం పల్లెల్లోనే షూటింగ్ చేశాడు. రెండేళ్ల పాటు ఆటుపోట్లు ఎదుర్కొని సినిమా పూర్తి చేసి ఈ నెల 12న విడుదల చేశాడు. ఓ నలుగురు స్నేహితులు ఓ సేవా సంస్థగా ఏర్పడి అత్యవసర సమయాల్లో రక్తదానం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ఆదుకోవడం, నిరుపేద విద్యార్థులను చదివించడం వంటి సామాజిక అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది. ప్రధానంగా ప్రతినాయకుడు చివరకు సామాజిక కార్యకర్తగా మారేలా చిత్రాన్ని రూపొందించాడు.

వారం పాటు ఉచిత ప్రదర్శన

సామాజిక అంశాలపై తీసిన ఈ చిత్రాన్ని వారం రోజుల పాటు కవిటి మహాలక్ష్మీ సినిమా హాల్‌లో ప్రదర్శించారు. సుమారు రూ.రెండు లక్షల వ్యయంతో నిర్మించిన ఈ సందేశాత్మక చిత్రాన్ని చూసిన ప్రతి పది మంది వ్యక్తుల్లో ఒక్కరు తోటి వారికి సాయపడాలన్న ఆలోచన వస్తుందనే ఆలోచనతో ఈ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు పురుషోత్తం తెలిపాడు.

సగంలో ఆపేద్దాం అనుకున్నాం..



సినిమా రంగంలో ఏ మాత్రం అనుభవం లేకపోయినా, ధైర్యంతో ముందడుగు వేశాను. ఏడాది పాటు సినిమా షూటింగ్ సమయంలో కొంత మంది నటులు మధ్యలో వైదొలగడం, ఆర్థికంగా ఇబ్బంది పడటంతో సినిమాను మధ్యలో నిలిపివేద్దాం అనుకున్నాను. డబ్బులు కోసం ఏ ఒక్కరి దగ్గర చేయి చాచలేదు. కష్టమో, నష్టమో సినిమా పూర్తి చేసి నా టాలెంట్‌ను నిరూపించుకోవాలని అనుకున్నాను. ఎవరైనా పెట్టుబడి పెడితే ఇదే చిత్రం పార్ట్–2 తీయాలనుకుంటున్నాను. ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– పురుషోత్తం మజ్జి, తిప్పనపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం

వంశధారకు మధుకేశ్వరుడు

- శ్రీముఖలింగంలో నేడు త్రిశూల చక్రతీర్థ స్నానాలు
- పకడ్బందీగా పోలీసు బందోబస్తు

జలుమూరు: ప్రఖ్యాత శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు సోమవారం స్వామికి వంశధార నదిలో త్రిశూల చక్రతీర్థ స్నానాల క్రతువు నిర్వహించనున్నారు. ఈ వేడుకకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని డీఎస్పీ శివరామిరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రధాన ఆలయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత స్వామి ఉత్సవ మూర్తులను తూర్పు దిశన బయల్దేరి ఉత్తర దిశగా వంశధార నదికి తీసుకువెళ్తారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నదిలో రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు రోడ్లు భవనాల శాఖ అధికారులు తెలిపారు. లక్షల సంఖ్యలో భక్తులు ఈ పుణ్య స్నానాలకు వచ్చే అవకాశం ఉందని డీఎస్పీ తెలిపారు.

ప్రధానంగా ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులను నందివాహనంపై తీసుకువెళ్లే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దారి పొడవునా 10 రోప్ పార్టీలు వినియోగిస్తున్నామని, అలాగే నదికి ఇటు 280 మంది అటు సరుబుజ్జిలి వైపు 200 మందితోపాటు అదనంగా 140 మందిని వినియోగించనున్నామని పేర్కొన్నారు. ఆలయం వద్ద స్వామి దర్శనాలు, నదిలో బందోబస్తు, మిరాయపల్లి రేవులో పుణ్యస్నానాలు జరిగే సమయంలో భక్తుల రద్దీ, అల్లరిమూకల నిలుపుదల, శ్రీముఖలింగం గ్రామానికి రెండు వైపులా ట్రాఫిక్ నియంత్రణ, పుణ్యస్నానాలు అనంతరం భక్తులను తిరిగి వారి స్వగ్రామాలకు చేర్చడం ప్రధానమని సీఐ డి.రాము తెలిపారు. చక్రతీర్థ స్నానాలకు అంతా సహకరించాలని ఆయన కోరారు.

వీటితోపాటు నది మార్గంలో కూడా ధూళి, దుమ్ము రేగకుండా ట్యాంకర్లతో నీరు చల్లిస్తామని పంచాయతీ విస్తరణ అధికారి ఈశ్వరరావు తెలిపారు. సర్పంచ్ టి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.



స్వామిని నదికి తీసుకువెళ్లే నంది వాహనం



బారికేడ్లు పరిశీలిస్తున్న డీఎస్పీ శివరామిరెడ్డి తదితరులు

సజావుగా ఎస్ఐ రాత పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 21 సెంటర్లలో పరీక్షల నిర్వహణ
- దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 9153
- హాజరైన వారు 8102 మంది
- పురుష అభ్యర్థులే అత్యధికం



చిలకపాలేంలోని శివానీలో పరీక్షల తీరు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక



ఉదయం 7.30 గంటలకు చైతన్య టెక్నో స్కూల్ వద్ద బారులు తీరిన అభ్యర్థులు, పర్యవేక్షిస్తున్న రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్, ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్ష సజావుగా జరిగిందని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఎచ్చెర్ల, చిలకపాలెం, శ్రీకాకుళం ముఖ్య కేంద్రాలుగా 21 సెంటర్లలో పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, చైతన్య కో ఆపరేటివ్ కళాశాల తదితర పరీక్ష కేంద్రాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. మొత్తం జిల్లాలో 9153 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 8102 మంది హాజరయ్యారని తెలిపారు. ఇందులో అత్యధికంగా పురుషులు 6432 మంది కాగా, స్త్రీలు అత్యల్పంగా 1670 మంది హాజరయ్యారని వివరించారు. ఈ పరీక్షలకు రీజియన్ నోడల్ అధికారిగా డీఎస్పీ ప్రేమ్ కాజల్, జిల్లా నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, రూట్–1 ఇన్‌చార్జిగా (ఎచ్చెర్ల, చిలకపాలెంలోని 10 కేంద్రాలకు) శ్రీకాకుళం సబ్ డివిజనల్ అధికారి డీఎస్పీ మహేంద్ర మాతే, రూట్–2,3 ఇన్‌ఛార్జిగా (శ్రీకాకుళం పట్టణ ప్రాంతంలోని 11 కేంద్రాలకు) దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వాసుదేవ్‌లు వ్యవహరించి బందోబస్తును పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల్లో జరిగాయని, అన్ని కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఎచ్చెర్ల మండల పరిధిలోని పరీక్ష కేంద్రాలను విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, ఎస్పీ రాధిక, డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షించారు.



చిలకపాలేంలో శివానీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విశాఖపట్నం డీఐజీ ఎస్.హరికృష్ణ